


చుట్ట తాగడము సనాతనమైన ఆచారమేనా, లేక ఈ యుగము వారు అలవరుచుకొనిన ఒక దురభ్యాసమా అని ప్రశ్న వచ్చింది.

పోర్చుగీసునావికుడు వాస్కోడిగామా మనదేశానికి పొగాకు తీసుకొని వచ్చినాడనీ, అంతకుముందు మనదేశవాసులకు పొగాకు సంగతి తెలియదనీ ఒక వదంతిమాత్రము ఉన్నది.

కాని ఈ విషయం అంగీకరించడానికి ఏమాత్రమూ వీలుపడదు. మన ప్రాచీన గ్రంథాలలో ఈ చుట్ట ప్రశంస వచ్చినది. కాబట్టి, చుట్టతాగడము చాలా ప్రాచీనమైన ఆచారముగా మనము అంగీకరించవలసి ఉంటుంది.

భీముడు చుట్టతాగేవాడని ఢంకామీద దెబ్బకొట్టి చెప్పవచ్చును. భారతములోనే కావలసినంత సాక్ష్యము దొరుకుతుంది.

విరాటపర్వంలో అన్నాడూ "మొల జూపి పెక్కుచుట్టల్ పలుత్రాటంజుట్టి గోపభావం బమరన్" అని.

భీముడు క్షణక్షణానికి చుట్టుకోలేక చాలా పెద్దవైనవినీ, బరువైనవినీ అయిన చుట్టలు ఎక్కువగా ఒకేసారి చుట్టుకొని వాటిని చాలా త్రాళ్ళతో బిగించి, ఒకచోట పడేసి ఉంచుకొనేవాడు, కావలసినప్పుడల్లా ఒకటో రెండో తీసి కాల్చుకొనేందుకు.

'గోపభావం బమరన్' అని ఎందుకు అనవలసివచ్చిందీ అంటే.

.. పెనవ చుట్టలు చుట్టీ చుట్టీ ప్రాణం విసిగిపోయి, చివరకు తనమీద తనకే కోపం వచ్చింది అని చెప్పవచ్చు.

లేకపోతే ఇంకొక విధంగా చెప్పవచ్చు. పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్నారు. వారంతా విరటుని కొలువులో ఉన్నారు. అప్పుడు తీరిక సమయంలో ఎప్పుడో భీముడు ఈ చుట్టలు చుట్టుకొని, 'మహారాజునై యుండికూడా ఎంతగతి పట్టింది నాకు; చుట్టలు చుట్టి ఇచ్చేందుకు ఒక్క సేవకుడైనా లేకపోయెనుగదా!' అని వాపోయినాడు అని చెప్పినా చెప్పవచ్చు.

సాహిత్యంలోనే ఇంకో నిదర్శనం చూపిస్తాను; చుట్టసంగతి మనవాళ్ళకు తెలుసును అంటానికి.

"ఎంచక నా గమనమునకు ఇంచుక చుట్టయిన కానిమ్ము" అని కళాపూర్ణోదయంలో ఉన్నది కళాపూర్ణోదయుడే ఈమాట అని ఉంటాడు. ఏమనీ అంటే, ఈ ప్రయాణంలో నాకు ఒక చుట్ట అయినాసరే ఇయ్యవలసిందీ, అని!

'చుట్ట అయినకాని, ఇమ్ము' అంటే ఒక చుట్టముక్క అయినా ఇయ్యవయ్యా అన్న మాట.

అంటే ఆ కళాపూర్ణోదయుడు చుట్టె తరంకూడా తాగేవాడని ప్రాకరణికార్థం. అది ఏదో మనము ఇప్పుడు ఊహించలేము.

ధర్మరాజు ఒకసారి ఏదో ప్రసంగంలో చుట్ట అంటే ఎవరికీ కోపం రాకూడదు అని చెబుతూ, "చుట్టయును పగయును భేదం బెట్టి జనులకు తగదు" అన్నాడు. చుట్ట త్రాగేవాడు కాకపోతే దానిని అంతగా పెనకేసుకురాడు.

కాటూరు వెంకటేశ్వరరావుగారు పడుకొనేబోయేముందు రెండు మూడు చుట్టలు చుట్టుకొని, పక్కనున్న బల్లపై పెట్టుకొని నిద్రపోయేవారు. "పడుకోబోతూ ఉంటిరి. ఇప్పుడు తాగరుకదా! ఎందుకండీ చుట్టలు చుట్టుకొన్నారూ?" అని అడిగాను.

"రేపు ప్రొద్దున నిద్ర లేవడముతోనే కావాలయ్యా. అప్పుడు చుట్టుకోటం అంటే బద్ధకంగా ఉంటుంది. అందుకని ఇప్పుడే చుట్టలు చుట్టుకొని పరుంటాను.

"భూభారాన్ని మోసే ఆదిశేషు కూడా ఇల్లాగే చేసేవాడట. 'చుట్ట చుట్టుకొని పరుండె' అని భాగవతంలో ఉన్నది" అన్నారు.

విష్ణుమూర్తికి 'చుట్టవాలుజోదు' అని పేరు ఎందుకు ఉన్నది, అని అడిగితే ఏమి సమాధానం చెపులారు? ఏదో పోనిలే అని ఊరుకుంటూ ఉన్నా కాబట్టి సరిపోయింది కాని! అసలు చుట్టతో ఆయనకు ఏమి సంబంధం? ఎందుకు గ్రంథంలోకి దిగడము! ఆయన చుట్ట తాగేవాడని తెగేసి చెప్పి ఊరుకుంటాను

అయితే శ్రీ విష్ణు పాదారవింద సేవకులూ శ్రీ ఏడుకొండల వేంకటరమణుని భక్తులూ మొదలైనవారిచే త్రాగబడే చుట్టలకు తిరుచుట్టలు అని పేరు. మనము తాగేవి మామూలు చుట్టలు. అంతే భేదం.

కాబట్టి భారతకాలం నాటికే చుట్ట త్రాగే అలవాటు మనకు ఉన్నట్లు తేలిపోయింది.

మరొక్క విషయము కూడా తెలుస్తున్నది. గురుజనుల సమక్షంలోనూ, స్త్రీల ఎదుటా చుట్ట తాగేవారు కారని భారతంలో ఉన్నది.

ఎక్కడ ఉన్నదీ అనవచ్చు. త్రాగవచ్చునని ఎక్కడ ఉన్నది? త్రాగవచ్చునని లేదు కాబట్టి, త్రాగకూడదు అనే ఉన్నట్లు మనము విధిగా భావించవలె. ప్రతిపక్షులకు అనుకూలదృష్టాంతము లేనపుడూ, మనము చెప్పినదానికి దృష్టాంత విరోధము లేనపుడూ స్వపక్షస్థాపన జరిగినట్లే భావించుట తర్క సమ్మతము. ఇతి తర్కః.

స్త్రీల సమక్షంలో చుట్ట తాగడము నిషేధమే అయినప్పటికీ, ప్రియురాలితో ఏకాంతంగా ఉన్న సమయంలో చుట్ట తాగడము ఆనుపూర్విక సంప్రదాయముగా కనిపిస్తుంది.

భార్య ప్రియునిదగ్గరకుచేరి తమలపాకుల

'చుట్టలు' ఇచ్చినట్లు అనేకచోట్ల వర్ణితము. పాండురంగ మాహాత్మ్యంలో ఈ విషయము స్పష్టంగా చెప్పినాడు "తనదు తోయ్యలి, విడ్యము చుట్టయీగాన్" అని ఉన్నది భార్య తములపాకులూ, చుట్టా కూడా, ఇచ్చినట్లు చెప్పబడి ఉన్నది

బంధువులు, స్నేహితులు వచ్చినపుడు భోజనానంతరం అందరికీ తలాకచుట్ట ఇయ్యడము ఇప్పటికీ మనలో ఆచారంగా ఉన్నది

ఈ ఆచారము భారత కాలంనాటికే ఉన్నదని ఊహించడానికి ఆధారాలు దొరుకుతున్నవి

శ్రీకృష్ణ భగవత్పాదులవారి ఇంటికి బంధుజనులంతా వచ్చినారు ఆ వచ్చినవారిలో పాండురాజు తనయులూ, ధృతరాష్ట్రుని కుమారులూ కూడా ఉన్నారు

శ్రీకృష్ణుడు మొదటినుంచీ పాండవుల యందు స్నేహభావంతో ఉంటూ, ఆదరణ చూపిస్తూ, పక్షపాతం ప్రకటిస్తూ ఉండినాడు

ఒక సందర్భంలో చుట్టలు ఈయడములో కూడా ఈ పక్షపాతమే ప్రదర్శించి, పాండు తనయులకు తలాక చుట్ట ఇచ్చి, ధార్తరాష్ట్రులకు ఇయ్యలేదు

అల్లాగ పక్షపాతంతో ప్రవర్తించడానికి కారణము ఊహించడమూ కష్టముకాదు పొగాకు ఆ రోజులలో చాలా ప్రియంగా ఉండి సర్వజన లభ్యంగా ఉండేదికాదు మహారాజులు మాత్రమే చుట్ట తాగేవారు

పాండవులు అయిదుగురు ఆ అయిదుగురికి అయిదు చుట్టలు ఇయ్యడము అంత కష్టమైన పనికాదు

ధార్తరాష్ట్రులు నూర్గురు అంతమందికీ చుట్టలు ఇయ్యడము కష్టం

ఈ కారణముచేతనో, లేక పాండవ పక్షపాతి కావడముచేతనో శ్రీకృష్ణభగవానులు పాండవులకు మాత్రము చుట్టలు ఇచ్చి, ధార్తరాష్ట్రులకు ఇయ్యలేదు

అప్పుడు భీష్మాచార్యుడో కృపాచార్యుడో అంటాడూ; "పాండవులు ధార్తరాష్ట్రులు పుండరీక నేత్ర చుట్టరికంబున నీకు నొక్కరూప" అంటాడు

'హే మహానుభావా, కృష్ణా, పాండవులు, ధార్తరాష్ట్రులు అనే భేదం ఉండకూడదు చుట్టరికంబున అనగా చుట్టలు పంచియిచ్చేవిషయంలో అందరూ నీకు ఒక్కరూప, అందరూ సమానులే సుమా' అంటున్నారు ఆ ఆచార్యులవారు చుట్టకు సంబంధించిన స్నేహమే చుట్టరికమని ముందు నిరూపిస్తాను

ఆచార్యులవారితో సంబంధం ఉన్నది కాబట్టి అవి తిరుచుట్టలే అయిఉంటవి

చుట్టతాగడము ప్రధానంగా రాజులపరంగానే కనపడుతుందిగాని సామాన్యులవిష

# రచయితలకు మనవి

ఇటీవల కొందరు రచయితలు ఇదివరలో అచ్చయిన తమ రచనలను క్రొత్త రచనలన్నట్లు ఇప్పుడు తిరిగి మాకు పంపడం, కొందరు ఇతరుల రచనలను అన్యభాషలలోనుంచీ, తెలుగులోనుంచీ సంగ్రహించి స్వతంత్ర రచనలుగా పంపడం జరుగుతున్నది వీరు సోదర రచయితలకు, మాకు జరుగుతున్న అపచారాన్ని గుర్తించడంలేదు మాకు వచ్చే రచనలను, అనుమానంతో పరిశీలించడం రచయితలకుగాని మాకుగాని గౌరవప్రదం కాదని గుర్తించవలసిందిగా వీరిని ప్రార్థిస్తున్నాము ఇందువల్ల చిక్కులకు లోనుకావచ్చునని ఇట్టివారు గ్రహించడంమేలు ఇదివరలో మా పత్రికలో గాని, ఇతర పత్రికలలోగాని ప్రచురించబడిన వేలాది రచనలను చదివి జ్ఞప్తిలో ఉంచుకోడం ఏ సంపాదకునికైనా అసాధ్యమైన విషయమని ప్రత్యేకం చెప్పనవసరంలేదు

అన్యథా సూచించినప్పుడు తప్ప, మాకు వచ్చే రచనలు మొదలైనవి, పంపినవారి స్వతంత్ర రచనలేననే, భావంతోనే మేము ప్రచురించడం జరుగుతుందని అందరూ గుర్తించ ప్రార్థన

## మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు ఈ క్రింది అంశాలనుకూడా గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్‌పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతోనే చేర్చిపంపాలి

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి నెగటివ్‌లు స్వీకరించబడవు

చిత్రాలు ఇండియన్ ఇంకుతో వేసిపంపాలి రంగుల చిత్రాలు స్వీకరించబడవు

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం

నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయం నుంచి ఎట్టిదైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము

—సంపాదకుడు



శాఖాకరములు

ఫోటో: ఆర్. శివారెడ్డి—ముద్దనూరు.

# ★ చుట్ట ★

యంలో అంతగా వ్యాప్తిలో ఉన్నట్లు కనపడదు.

ధర్మరాజు నిర్మించిన మయసభ సంగతి చెప్పే సందర్భంలో సభాపర్వంలో, "సామంతరాజులు చుట్టుకొనిరి"-అని ఉన్నది.

ఏమి [illegible]ంటారు! చుట్టలే చుట్టుకొని ఉం[illegible] ప్రాకరణికార్థము.

ఇల్లాగ [illegible]ంతంలో ఎక్కడ చూచినా చుట్టలసంగతి బహుళంగా ఉన్నది.

ఇంకొక సంగతి జ్ఞాపకం వచ్చింది. విష్ణుమూర్తికి చుట్టాలంటే మహా ఎక్కువైన ప్రీతి అని చెప్పటానికి రెండు మూడు నిదర్శనాలు కనపడుతున్నవి. విష్ణువుకు శంఖచక్రాలు ఉన్నవి అన్నది అందరికి తెలిసినవిషయమే.

శ్రీరంగనాథునికి చుట్టయందు ఉండు కున్నట్టు కంటె ప్రేమవల్లనే తిరుశంఖమునకు 'చుట్టుగుళ్ళ' అని పేరు పెట్టుకొన్నాడు. చుట్టుగుళ్ళఅన్నా చుట్టగుళ్ళఅన్నా ఒకటే అర్థము. అల్లాగే తన చక్రాయుధానికి చుట్టు పైయిదువు అనికూడా ముద్దుపేరు.

అసలు ఆయనకే చుట్టువాలుండాలి, చుట్టువాలుకోడు అనేపేర్లు ఉన్నవి. చుట్టకే రూపాంతరము చుట్టు. చుట్టబడినది కాబట్టి చుట్టు - పెట్టు, తిట్టు, కట్టు, నెట్టు, మొట్టు శబ్దంబులవలె ఏర్పడినది.

పూర్వకాలంలో రాజులకోసం చుట్టలు తయారుచేయడానికి ప్రత్యేకంగా ఒక ఇల్లు ఉంటూ ఉండేది. దానినే చుట్టిల్లు అనేవారు. చుట్టలు చుట్టడానికే ఏర్పడిన ఇల్లు 'చుట్టిల్లు' అయింది. ఇది నట్టిల్లు వంటి శబ్దము. నడు + ఇల్లు నట్టిల్లు అయినట్లే చుట్టు ఇల్లు చుట్టిల్లు అయింది.

చుట్టలు తాగేవారు ఇద్దరు కలియుచుండు తోనే వారిద్దరికి ఇట్టే స్నేహము కుదిరేదుండి. ఆ ఇద్దరిలో ఒకరు చుట్ట చుట్టుకొని, నోట పెట్టి ఏమాటా అనకుండానే రెండవ వానివైపు చెయ్యి చాచడముతోనే, ఆ రెండవ మనిషి నిప్పుపెట్టె తీసి అతని చేతిలో పెడతాడు.

సాధారణంగా మొదటి పెద్ద మనిషి రెండు చుట్టలు చుట్టి పక్కనున్న పెద్ద మనిషికి ఒకటి ఇయ్యడమే ప్రాకటము.

ఇల్లాగ చుట్ట సంబంధంగా ఇద్దరు మనుష్యుల మధ్య ఏర్పడిన సంబంధమే చుట్టరికము అయినది. ఇదే చుట్టరిక శబ్దముయొక్క వ్యుత్పత్తి తాత్పర్యము.

ఈ వ్యాపారం ప్రాముఖ్యంగా బంధువుల మధ్యనే జరుగుతూవచ్చిన కారణాన చుట్టరికము అంటే బంధుత్వము అనే అర్థము స్థిరపడిపోయి రూఢము అయినది. దీనినే [illegible] అని కూడా అంటారు.

ఇప్పటికీ చుట్టము అంటే బంధువు అనే అర్థమే కాకుండా స్నేహితుడు అనే అర్థము కూడా ఉన్నది.

చుట్ట, పొగ అనే మాటలకు తర్కశాస్త్రంతో ఉన్న సంబంధము చూస్తే, చుట్ట యొక్క ప్రాశస్త్యమేకాక, తర్కశాస్త్రము రచించిన గౌతముడూ, వాత్స్యాయనుడూ గజ్జాచార్యులవారూ గంగేశోపాధ్యాయులూ మొదలైనవారు చుట్టా, పొగా, ఈ రెంటికిని గల సంబంధమును బాగా గుర్తించినవారు అని స్పష్టంగా బోధపడుతుంది.

తర్కంలో అనుమాన ప్రమాణవాదము అనబడే ఒకవాదము ఉన్నది. ఆ వాదమ

# "ఉదయ కిరణాలు"

## నవలా రచన పోటీలో బహుమతి పొందిన నవల

## కర్త: శ్రీ పోతుకూచి సాంబశివరావు, హైదరాబాద్.

## మే 25 వ తేదీ సంచికలో ప్రచురణ ప్రారంభం

★

ఈ యేడాది ఆంధ్ర పత్రిక సచిత్ర వారపత్రిక జరిపిన నవలా రచన పోటీలో రు 250/- బహుమతి పొందిన నవల 'ఉదయ కిరణాలు" ప్రచురణ మే 25 వ తేదీ వారపత్రికలో ప్రారంభమౌతుందని మా పాఠకులకు తెలియపరచడానికి ఆనందిస్తున్నాము.

—సంపాదకుడు.

ఇల్లాగ ఉంటుంది "ఎక్కడ ధూమము ఉన్నదో అక్కడ అగ్ని ఉన్నది. ఇక్కడ ధూమము ఉన్నది, కాబట్టి ఇక్కడ అగ్ని ఉన్నది" ఈవాదననే ఇంగ్లీషులో సిలోజిజమ్ అంటారు.

ఈరకము వాదనకు ప్రాణం వాచ్యేనాయబడిన విచిత్రతర్కం చూడనగును "ఎక్కడెక్కడ ధూమము ఉన్నదో అక్కడక్కడల్లా అగ్ని ఉన్నది" అన్నది హేతువాక్యము.

ఆ హేతువాక్యమే దోషయుక్తము అయితే వాదము దోషభూయిష్ఠము అవుతుంది హేతునిర్ణయము చేయడంలోనే తార్కికుని ప్రతిభ ప్రదర్శితము అవుతుంది.

అందుచేత తార్కికుడు హేతుపుష్టి కోసమూ వైయాకరణి ధాతుపుష్టి కోసమూ చూస్తూ ఉంటారు.

ఆసంగతి అల్లాగ ఉంచి ప్రకృతానికి వద్దాము.

ఇప్పుడు పైన చెప్పినవాదనలో హేతుపుష్టి ఉన్నది. ఎందుచేతనూ అంటే పొగ ఉన్నచోటల్లా అగ్ని ఉంటుందీ అన్న విషయాన్ని కాదని ఎవరూ అనలేరు

కొంచెము తార్కిక పరిభాషలోకి వడితే, ధూమానికి, అగ్నికీ, నియత సంబంధము ఉన్నది అని అంటారు. ఆ రెండూ ఎప్పుడూ కలిసిఉంటవి. పొగ ఉన్నది అంటే, అగ్ని ఉన్నదన్నమాటే, అందుకనే 'యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః' అని చెప్పారు శాస్త్రకారులు

పై హేతువాక్యాన్ని తార్కికుడు ఎట్లా నిర్ధారించగలిగినాడు? అని ప్రశ్న "మట్ట తాగడాన్ని చూచి!" అని జవాబు వచ్చినట్లు చెప్ప తీరాలె! ఇంకోమార్గం లేదు!

ఎందుకంటే ఆ నియత సంబంధం ఒక్క ఈ విషయంలోనే అనుమానానికి అవకాశం లేని పద్ధతిలో కనిపిస్తుంది. చుటలో అగ్ని ఉంటే నోట్లోనుంచి ధూమము వస్తుంది అగ్ని లేకపోతే ధూమం రాదు. యత్ర యత్ర వహ్నిర్నాస్తి తత్ర తత్ర ధూమోఽపినాస్తి

అయితే "చుట్ట కాల్చుచుండగా ధూమము వచ్చుటయూ అచ్చట అగ్నియు ధూమమును కలిసియుండుటయూ, మేము చూచితిమి" అని ఈ తార్కికులు ఒప్పుకోరు ఒప్పుకోక 'యత్ర ధూమస్తత్రాగ్నిః, యథా మహానసః' అంటారు. ధూమమూ అగ్ని వంటయింటియందు నియత సంబంధముతో ఉన్నవి అని అన్వయ దృష్టాంతము ఇస్తారు.

ఇల్లాగ అనడము చుట్టయందు కేవల వ్యతిరేక భావము ఉండడమువల్లనే గాని మరొకటి కాదు. చుట్టకు ఈ విధంగా అన్యాయం జరిగింది తార్కికుల చేతులలో.

ఈ కారణముచేతనే ఈనాటికీ తర్కం చదువుకొన్నవారి చేతిలో చుట్ట భస్తీ కాలదు అందుకనే వాళ్లు మట్ట తాగరు. ఈ విషయం నిజమో అబద్ధమో తెలుసుకోవలెనంటే జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి గారిని, తిరువెంగళాచార్యులు గారిని అడుగవచ్చు.

నిజానికి ధూమానికి, అగ్నికి ఏకాంతిక సంబంధం మహానసములో చెప్తే కుదరదు. అక్కడ సంగతి మా కాంతాన్ని అడిగాను, "ఏమిటి నిజం సంగతి చెప్పు; ధూమము ఉన్న చోట్లనల్లా అగ్ని ఉంటుంది అంటాడు న్యాయదర్శన గ్రంథకర్త. అది నిజమేనా!" అని

తర్కశాస్త్రం రచించిన గౌతముడే కాని ఆ గ్రంథాన్ని తెలిగించిన వెంకటరమణశాస్త్రిగారే గానీ ఎవరైనా సరే, ఈ ధూమాగ్నుల మధ్య ఉన్న సంబంధం విషయంలో కొంతం చెప్పడానికి కటిక్కన తల వంచవలసిందే గాని కాదంటానికి వీలులేదు ఈ విషయంలో ఆమె నిర్ణయము ప్రమాణవాక్యము. దానికి విప్రతిపత్తి లేదు కాబట్టి ఆమెవాక్యం సర్వతంత్రసిద్ధాంతముగా, అనగా ఇతరశాస్త్రములకు వైరుధ్యంబులేనిదానినిగా అంగీకరింపక తప్పదు.

"అనేకసార్లు ఊరికే పొగరాజుతుందే గాని నిప్పు రాజదు. ఎప్పుడైతే నిప్పురాజి అగ్ని ఏర్పడుతుందో అప్పుడు పొగఉండదు" అని ఆమెగారు తెగేసి చెప్పింది.

# ★ చుట్ట ★

మహానసములో ధూమాగ్నులకు నియత సంబంధం లేదు. ఒక్క చుట్ట కాలుస్తున్నపుడే ఎఱ్ఱని నిప్పూ, పొగా కలిసి ఉంటవి.

కాబట్టి యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః అన్న వాక్యం చుట్ట దహనసంస్కారాన్ని చూచే అనబడ్డది.

గౌతముని కాలం నాటికి చుట్ట కాల్చడము మిక్కిలి వ్యాప్తిలో ఉండవలె.

అభ్యుదయ రచయితలు అన్నట్లు ఆ కాలంలో రాజులను సంతోషపెట్టడానికే సకల శాస్త్రములూ, కావ్యాలు పుట్టినవి కాబట్టి, రాజులు చుట్టకాల్చడానికి సంబంధించిన ఈ వాక్యం తర్కశాస్త్రంలోకి ఎక్కింది.

కాబట్టి ఇంతకూ తేలిన విషయము ఏమిటీ అంటే, చుట్ట పంఖీనిమీదే తర్కశాస్త్రం పుట్టింది అని!

ఉదాహరణలో మహానసములోవలె అని చెపుతారు తార్కికులు. అల్లాఅనక యత్ర యత్ర ధూమస్తత్రాగ్నిః యథా, చుట్టదహనసంస్కార వైఖరీః అని ఉండాలిసింది.

సాధర్మ్యనిరూపణ ఇల్లాగ చుట్టకు సంబంధంగా ఉండకపోవడానికి కారణముకూడా మనము ఊహించవచ్చు. మొదట్లో రాజులకు సంబంధించిన ఆచారాన్ని తర్కశాస్త్రంలోకి ఎక్కించారు. కాని తరువాత రాజుల ప్రతిభ తగ్గింది. బ్రాహ్మణుల ప్రాబల్యం వచ్చింది. చుట్ట త్రాగడము రాజులలో ఉండేదని చెప్పాను. వారు క్షత్రియులు. అనగా బ్రాహ్మణేతరులు. బ్రాహ్మణేతరుల ఆచారాన్ని పేర్కొని, దానికి తర్కశాస్త్రంలో ప్రాధాన్యము ఇయ్యడము, తర్కశాస్త్ర గ్రంథకర్తలైన బ్రాహ్మణులకు ఇష్టం లేకపోయివుంటుంది. అందుకనే తమకు ఇష్టమైన మహానస విషయము ఉదాహరణగా చేర్చినారు.

బ్రాహ్మణులవలన బ్రాహ్మణేతరులకు జరిగిన అన్యాయాలలో ఇది యొకటి.

ఇక అలంకారశాస్త్రంలో చుట్టకు కావలసినంత ప్రమేయము ఉన్నది. అదిప్పుడు తేలే విషయం కాదు. సంస్కృత వాఙ్మయంలో చుట్ట ప్రశంస కొద్దిగా ఉన్నదని చూపిస్తాను. కాళిదాసు మేఘసందేశంలో మేఘములు చుట్టలతో పోల్చబడినవి. మేఘములు చుట్టలుచుట్టుకొని గగనమార్గాన సంచరిస్తున్నవట!

ధూమజ్యోతిస్సలిలమరుతాం అన్నచోట ధూమప్రశంస వచ్చింది. కాబట్టి కాళిదాసుకు చుట్ట తాగడమూ, దానివలన పొగను పుట్టించడము అనే విషయాలు తెలిసే ఉండాలె.

చుట్ట తాగడములో రెండు విశిష్టమైన పద్ధతులున్నవి. దక్కని ఒక పేటికలో కొన్ని చుట్టలను పేర్చి దానినీ, ఒక నిప్పుపెట్టెనూ, పక్కనున్న గుండ్రని బల్లపై పెట్టి, ఒక పడక కుర్చీలో శయనించి ఠీవిగా చుట్టను ముట్టించి, ఆప్యాయంగా ధూమపానం చేయడము ఒక పద్ధతి. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ఈ పద్ధతిలో చుట్ట కాలుస్తారు

అరుగుపైనగాని లేక మరొకచోటగాని చాపపై నడ్డిగంవేసి కూర్చుని చుట్ట తాగడము మరొక పద్ధతి. కాటూరువారు ఈ పద్ధతిలో చుట్ట తాగుతారు.

ఈ రెండవ పద్ధతిలోకూడా ఠీవి, రాజసము హుందాతనము సరళత, స్నేహభావమూ, రాజభూయము మొదలైన సుగుణాలు ప్రదర్శితము కావడానికి అవకాశాలు ఉన్నవి.

చక్రవాకములు సూర్యునియందు, చకోరికలు చంద్రునియందు, తుమ్మెదలు పువ్వులగుత్తియందు ఎల్లాంటి అనురక్తికలిగిఉన్నవో అలాగే కవులుకూడా కాటూరివారి చుట్ట తాగేపద్ధతియందుఅనురక్తినికలిగియున్నారు.

చుట్టా, బీడీ, సిగరెట్టు అనేవి ఉపాధిభేదం చేత వేరువేరు వస్తువులుగా కనపడుతూ ఉన్నప్పటికీ, వానిలో ఉపహితమైయున్న మూలపదార్థము ఒక్కటే.

ఒకటే పరమాత్మ పదార్థము త్రిమూర్త్యాకారమును పొందినట్లే, ఇదీనూ.

ఈ మహదర్థమును ఎఱిగిన కారణాన పండితులూ కవులూ అయినవారు ఈ త్రిమూర్తులనూ సేవిస్తూ ఉంటారు.

ఎట్లాగయినా ఈ త్రికములో పర్వతాలలో మేరువువలె శిఖరాలలో, కైలాసము లాగ, సముద్రాలలో క్షీరసముద్రమురీతి, యశోవైభవముకలిగి జగద్వ్యాపకమైనకీర్తిని కలిగియున్నది ఒక్క చుట్ట అనే చెప్పవలసి వస్తుంది.

చుట్ట తాగడమువలన అనేక ప్రయోజనములు సిద్ధిస్తూఉన్నవి. రాజకీయాలలో శేముషీధురంధరుడైన చర్చిల్ చుట్ట త్రాగడమువల్లనే అసమానమైన ప్రజ్ఞను సంపాదించినట్లు జగద్విదితము.

దేవులపల్లి, కాటూరి ప్రభృతులు చుట్ట తాగుతూఉన్న కారణానే, మహాకవులైనట్లు మనము ఊహించవచ్చును.

చుట్టను ముట్టించి విలాసంగా పొగను వదలి, వర్తులాకారమైన చిన్నచిన్న మేఘమండలాన్ని సృష్టించగా అవి మందమందగతిని ఆకాశంలో విహరిస్తూఉంటే, పంక్తులుగా నిలచిన బలాకములవలెనూ, బిసకిసలయముల 'సపాథేయు'లుగా గొని మేఘుని వెంట కైలాసమునకై పోవుచున్న రాజహంసలవలెను కనిపిస్తవి.

అదీకాక, ఆషాఢస్య ప్రథమదివసే మేఘమాశ్లిష్టసానుం వప్రక్రీడా పరిణత గజప్రేక్షణీయం దదర్శ, అనే శ్లోకపాదంకూడా జ్ఞాపకం వస్తుంది.

చుట్ట మనస్సుకు కలిగిన వ్యాకులతను పోగొడుతుంది అలసటను తీరుస్తుంది. దాహాన్ని ఉపశమింపచేస్తుంది. విరహార్తులను శమింపచేస్తుంది.

చుట్ట తాగడమువలన కలిగే ఆనందము, మధురమైన కావ్యమును చదివినపుడూ, ప్రియురాలు చెంపపై చిటికవేసి సరసోక్తులు ఆడేటప్పుడూ కలిగే ఆనందముతో సమానమైనది అని చెప్పవచ్చును

కోపము ద్వేషము మొదలైన మనోవికారాలను పోగొట్టటానికి చుట్టవంటి వస్తువు ఇంకొకటి లేదు.

మిత్రునివలె ఆదరించేది, ప్రియురాలివలె లాలించేది, తల్లివలె బుజ్జగించేది ఒక్క చుట్టే కాని మరొకటి కాదు.

ఈ వ్యాపారము ఒక్కటే పీయూషపానమువలె మధురమైనదీ, శరద్రాత్రివలె మనోహరమైనదీ అయిఉన్నది.

కాబట్టి మనము అందరమూ కూడా ఈ చుట్టకు ప్రణతశిరస్కులము కాకతప్పదు.

చుట్టయొక్క మాహాత్మ్యమునూ, పరువమునూ, ప్రయోజనమును గుర్తింపని కొందరు నాస్తికులు, దానినిగురించి అపభాషణ చేస్తూఉండటము చాలా శోచనీయము.

హే చుట్టే, అహంత్వాం ఉపాసే తమసోమాజ్యోతిర్గమయ. ★

**ఎల్లప్పుడు పరిమళ స్నానపునూనె ఉపయోగించండి.**

అనేక శ్రేష్ఠమైన మూలికలచే తయారుచేయబడినది. ఉష్ణమును తగ్గించి, కండ్లకు మెదడుకు చలవనిచ్చును. పైత్యమును తగ్గించును. కేశములు రాలుటను ఆపును. తలలో కురుపులు, దురద, చుండును మాన్పును. స్నానమునకు శ్రేష్ఠమైనది. "పరిమళ బేతింగ్ ఆయిల్" ఒక్కొక్క కుటుంబానికి చాల అవసరము. నేడే కొనండి. అన్ని చోట్ల దొరకును. సాంపిల్ సీసా: 0-4-0. చిన్న సీసా: 0-8-0. పెద్దసీసా: 1-4-0.

**పరిమళ పర్ఫ్యూమరి.** 7, గోపాల్ వీధి, త్యాగరాయనగర్, మద్రాసు-17.

ఏజెంట్లు కావలెను. వివరములకు స్టాంపులతో ఇంగ్లీషులో వ్రాయండి.